ప్రజాశక్తి
ఆదివారం 17 సెప్టెంబర్ 2023
5
విజయనగరం



5,905 మందికి 'కాపునేస్తం' సాయం

ప్రజాశక్తి-విజయనగరం

వైఎస్ఆర్ కాపు నేస్తం పథకం కింద జిల్లాకు చెందిన కాపు, తెలగ, ఒంటరి, బలిజ సామాజిక తరగతులకు చెందిన 5,905 మంది మహిళలు రూ.8.85 కోట్ల ఆర్థిక ప్రయోజనం పొందారు. సంబంధిత చెక్కును జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బూడి ముత్యాలనాయుడు, జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, డిఆర్ఒ ఎస్.డి.అనిత, బిసి కార్పొరేషన్ ఇడి పెంటోజీరావు లబ్ధిదారులకు అందజేశారు. సిఎం జగన్ శనివారం నిడదవోలు నుంచి ప్రత్యేక కార్యక్రమం ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లో నిధులను జమ చేశారు. ముఖ్యమంత్రి కార్యక్రమం అనంతరం కలెక్టరేట్‌లో జిల్లాలో లబ్ధిపొందిన మహిళలకు రూ.8.85 కోట్ల చెక్కును వారు అందజేశారు.

జనసేన పొత్తుతో టిడిపి ఆశావహుల్లో గుబులు

- నెల్లిమర్ల, గజపతినగరం సీట్లు అడిగే అవకాశం?

జనసేన పొత్తుతో జిల్లాలో టిడిపి తరపున ఎమ్మెల్యే టిక్కెట్లు ఆశిస్తున్న వారిలో గుబులు మొదలైంది. జిల్లాలో జనసేన ఎక్కడెక్కడ ఎన్ని సీట్లు అడుగుతుంది? ఆ మాటకొస్తే ఉమ్మడి జిల్లా వరకు వస్తుందా? లేక కేటాయించిన కోటా సీట్లను మన జిల్లా కన్నా బలంగా ఉన్న విశాఖ, గోదావరి తదితర జిల్లాల్లోనే భర్తీ చేసుకుంటుందా? ఇదీ ప్రస్తుతం జిల్లాలో జరుగుతున్న చర్చ. ఎన్నికల పొత్తుపై ఇటీవల జనసేన అధినేత పవన్ కల్యాణ్ క్లారిటీ ఇచ్చిన నేపథ్యంలో ఈ రకమైన చర్చ జిల్లాలో ముమ్మరంగానే సాగుతోంది.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఉమ్మడి విజయనగరం జిల్లాలో జనసేన సొంతంగా గెలిచే శక్తిలేదు. పొత్తులో భాగంగా జిల్లాలో పోటీకి తలపడదామనుకుంటే నెల్లిమర్ల, గజపతినగరం నియోజకవర్గాలు గానీ, లేదా ఇందులో ఒకటిగానీ అడిగే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. విజయనగరం, బొబ్బిలిలో జనసేనకు చురుకైన నాయత్వం ఉన్నప్పటికీ ఈ రెండు చోట్ల టిడిపి నుంచి అత్యంత క్రియాశీలకంగా ఉంటూ పార్టీలో రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేయగల నాయకులు ఉన్నారు. వీరిలో ఒకరు విజయనగరానికి చెందిన కేంద్ర మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు అశోక్ గజపతిరాజు, బొబ్బిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబీనాయన లేదా మాజీమంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు ఉన్నారు. ఇద్దరు రాజవంశీయులను పక్కనబెట్టి రాజకీయాలు చేసే పరిస్థితి టిడిపిలో లేదు. అలాగని జనసేన పట్టుబట్టి అడగడానికి స్వయంశక్తి సరిపోని పరిస్థితి దాపురించింది.

గత ఎన్నికల్లో నెల్లిమర్ల నుంచి జనసేన పోటీలో నిలిచింది. కొద్దోగొప్ప పార్టీ కార్యకలాపాలతో నడుస్తోంది. గజపతినగరంలో మాజీ మంత్రి పడాల అరుణ ఇటీవల జనసేనలో చేరారు. చాలా కాలంగా కార్యకర్తలు ఉన్నారు. దీనికితోడు మిగిలిన నియోజకవర్గాలతో పోలిస్తే జనసేన హడావుడి కాస్త ఉందనే చెప్పుకోవచ్చు. ఈ రెండు నియోజవర్గాల్లోనూ టిడిపి నాయకుల్లో గ్రూపు రాజకీయాలు చాలా కాలంగా సాగుతున్నాయి. ఇక మిగిలిన నియోజకవర్గాల్లో ఇంతకన్నా బలంగా ఉన్న పరిస్థితేమీ లేదు. ఈ నేపథ్యంలోనే గజపతినగరం, నెలిమర్ల లేదా వీటిలో ఏదో ఒక నియోజకవర్గంలో పోటీకి జనసేన ప్రతిపాదన పెట్టే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. దీంతో రెండు నియోజకవర్గాల్లో మాజీ ఎమ్మెల్యేలు, టిక్కెట్లు ఆశిస్తున్న ఇతర నాయకుల్లో లోలోపల గుబులు మొదలైంది. గజపతినగరం నుంచి టిడిపికి చెందిన మాజీ ఎమ్మెల్యే కె.ఎ.నాయుడు ఈసారి కూడా తనకే టిక్కెట్ వస్తుందన్న ఆశతో ఉన్నారు. ఈసారి టిడిపి అధినేత చంద్రబాబు యువతకు ప్రాధాన్యత ఇస్తారని, ఆ లెక్కన తన కుమారుడికి వస్తుందంటూ అప్పలనాయుడు సోదరుడు కొండబాబు కొద్ది రోజులుగా ప్రచారం చేస్తున్నారు. ఈ హామీతోనే ఇటీవల అంతా కలిసి చంద్రబాబు వద్దకు వెళ్లామని కూడా తన సన్నిహితుల వద్ద చెప్తున్నట్టు సమాచారం. మరోవైపు టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు అశోక్ జగపతిరాజు ద్వారా కరణం శివరామకృష్ణ కూడా ఎమ్మెల్యే టిక్కెట్ కోసం చాలాకాలంగా ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. ఇటు నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఇటీవల నియమితులైన కర్రోతు బంగార్రాజు ఆశతో ఉన్నారు. స్థానిక మాజీ ఎమ్మెల్యే పతివాడ నారాయణస్వామి నాయుడు కూడా తన కుమారులకు టిక్కెట్ ఇవ్వాలని కోరుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో జనసేనతో కుదిరిన పొత్తుతో ఈ రెండు నియోజకవర్గాలకు చెందిన ఆశావహుల రాజకీయ భవిష్యత్తు డైలమాలో పడినట్టేనన్న చర్చ నడుస్తోంది. జనసేన కోటా విజయనగరం వరకూ రాకపోతే ఏ సమస్యా ఉండకపోవచ్చని కూడా విశ్లేషకులు వెలువడుతున్నాయి.

వర్షాభావంతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ

నాట్లు పడని పొలాలను పరిశీలిస్తున్న ఎపి రైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘం బృందం

ప్రజాశక్తి-లక్కవరపుకోట

వర్షాభావంతో నష్టపోయిన రైతులను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. మండలంలో ఇప్పటికీ వరినాట్లు పడని పొలాలను రైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘం బృందం శనివారం పరిశీలించింది. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ జూన్, ఆగస్టు, సెప్టెంబర్‌లో వర్షపాతం లోటు వర్షపాతం వల్ల లక్కవరపుకోట, కొత్తవలస, భోగాపురం, వేపాడ, డెంకాడ మండలాల్లో పూర్తిస్థాయిలో వరినాట్లు పడలేదన్నారు. వాటిని కరువు మండలాలుగా ప్రకటించి, ప్రత్యామ్నాయ ప్రణాళికను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాట్లు వేయనిచోట ఎకరానికి రూ.20 వేలు చొప్పున ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలన్నారు. బీమా పథకాన్ని ప్రయివేటు సంస్థలకు కట్టబెట్టకుండా ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. యుద్ధ ప్రాతిపదికన నీటి వనరులు కల్పించాలన్నారు. పెట్రోల్, డీజిల్, పైపులు, నీటిఇంజిన్లు వంటివి రైతులకు సబ్సిడీపై ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి రాంబాబు, ఉపాధ్యక్షులు చల్లా జగన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గాడి అప్పారావు, పాల ఉత్పత్తిదారుల జిల్లా కన్వీనర్ గొంప కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఇనాం భూముల రైతులకు పట్టాలివ్వాలి

కొత్తవలస : చిన్నిపాలెం ఇనాం రైతులకు పట్టాలివ్వాలని ఎపి రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొత్తూరు గ్రామంలో ఇనాం రైతులతో ఆయన సమావేశమయ్యారు. చిన్నిపాలెం రెవెన్యూ పరిధిలో సుమారు 1200 ఎకరాలకు సంబంధించి రైతులకు ప్రభుత్వం హక్కులు కల్పించిందన్నారు. అప్పటినుండి రైతులు ఆ భూములను సాగు చేసుకుంటూ, జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఇటీవల జిఎంఆర్ గ్రూపునకు చెందినవారు ఇనాందారుల నుంచి కొన్నట్లు పత్రాల సృష్టించి, 1200 ఎకరాలను స్వాధీనం చేసుకునేందుకు రైతులను బెదిరిస్తున్నారని చెప్పారు. రైతుల నుండి కొనుగోలు చేయకుండానే, హక్కులు రద్దయిన ఇనాందారు అమ్మారని చెప్పడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. భూములపై హక్కులు కాపాడుకొనేందుకు రైతులు ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు, నాయకులు చల్లా జగన్, గాడి అప్పారావు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో వైద్యానికి భరోసా

- సీజనల్ వ్యాధులపై దృష్టి సారించాలి
- ఇ-క్రాప్ వంద శాతం పూర్తి చేయాలి
- జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బూడి ముత్యాలనాయుడు
- శృంగవరపుకోట నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బూడి ముత్యాలనాయుడు

ప్రజాశక్తి-విజయనగరం

ప్రతిఒక్కరి ఆరోగ్యానికి భరోసా కల్పించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఉపముఖ్యమంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బూడి ముత్యాలనాయుడు వెల్లడించారు. ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలను నిర్వహించడంతోపాటు అవసరమైన వారికి వెంటనే ఉచితంగా మందులు అందజేయాలని ఆదేశించారు. శృంగవరపుకోట అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధిపై శనివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. వ్యవసాయం, నీటిపారుదల, వైద్యారోగ్యం, గృహనిర్మాణం, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, విద్యుత్తు, డ్వామా, ఆర్అండ్‌బి తదితర శాఖలకు సంబంధించిన అంశాలపై సమీక్షించారు.

ఈ సందర్భంగా మంత్రి ముత్యాలనాయుడు మాట్లాడుతూ డెంగీ, మలేరియా తదితర సీజనల్ వ్యాధులపై దృష్టి పెట్టాలన్నారు. వైద్యారోగ్యశాఖ, పంచాయతీ శాఖలు సమన్వయంతో తక్షణమే స్ప్రేయింగ్, బ్లీచింగ్ నిర్వహించాలని సూచించారు. ప్రజలను జల్లెడపట్టి, వ్యాధులను గుర్తించి, వాటికి సమర్థవంతమైన చికిత్స అందించేందుకే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని చెప్పారు. ఇంటింటికీ సర్వే చేసి, ఏడు రకాల పరీక్షలను నిర్వహించి వ్యాధులను నిర్ధారించిన తరువాత, ఈ నెల 30 నుంచి ఆరోగ్య శిబిరాలలో స్పెషలిస్టు వైద్యుల ద్వారా వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని సుమారు 17 లక్షల మంది ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు.

వ్యవసాయశాఖపై నిర్వహించిన సమీక్ష సందర్భంగా, జిల్లాలో వంద శాతం ఇ-క్రాప్ చేయాలని మంత్రి ఆదేశించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమం కింద మంజూరైన విద్యుత్తు పనులన్నిటినీ, వేరే పథకాల కింద నిర్వహించాలని సూచించారు. ప్రాధాన్యత, ప్రాధాన్యేతర పనులన్నిటినీ సత్వరమే పూర్తి చేయాలని, బిల్లులకు సమస్య లేదని స్పష్టం చేశారు. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లను అక్టోబరు నెలాఖరికి పూర్తిచేసి, ప్రారంభించాలని ఆదేశించారు.

అనంతరం జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ సొంత స్థలాలు ఉండి ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి త్వరలో ఇళ్లు మంజూరు చేస్తామని, దీనికోసం అర్హుల జాబితాలను సిద్ధం చేయాలని సూచించారు. ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను, సమస్యలను వివరించారు. జిజిఎంపి కింద ఆర్‌డబ్ల్యుఎస్ ద్వారా సుమారు రూ.1.70 కోట్ల పనులు పూర్తి చేయగా, ఇప్పటివరకు కేవలం రూ.17 లక్షలు బిల్లులు మాత్రమే విడుదల కావడం పట్ల అసంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రధాన జంక్షన్లలో రహదారులు గోతులు పడ్డాయని, వీటి మరమ్మతు పనులను వెంటనే నిర్వహించాలని కోరారు. పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం కింద లేఅవుట్ల అభివృద్ధికి చేసిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని మంత్రి దృష్టికి తెచ్చారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డిఆర్ఒ ఎస్‌డి అనిత, సిపిఒ పి.బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కురక్షణ యాత్ర వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, నాయకులు

20 నుంచి ఉక్కు రక్షణయాత్ర

విజయవంతం చేయండి : సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణ కోసం సిపిఎం ఈ నెల 20 నుంచి చేపట్టే ఉక్కు రక్షణ బైక్ యాత్రను విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఎల్‌బిజి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో మోడీ సర్కారు ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తోందన్నారు. ఇప్పటికే ఎల్ఐసి, బిఎస్ఎన్ఎల్, రైల్వేతోపాటు అనేక ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటుపరం చేయడం, అమ్మేయడం చేసిందని ధ్వజమెత్తారు. అందులో భాగంగా విశాఖ ఉక్కు పరిశ్రమను తెగనమ్మేందుకు కంకణం కట్టుకుందని దుయ్యబట్టారు. అనేక మంది ప్రాణత్యాగాలు, ఎంతోమంది రైతుల భూదానం వల్ల ఏర్పడిన పరిశ్రమ అన్నారు. ఉత్తరాంధ్ర నుంచి సుమారుగా 2 లక్షల కుటుంబాలు దానిపై ఆధారపడి బతుకుతున్నాయని వెల్లడించారు. అటువంటి పరిశ్రమను పోస్కో లాంటి కంపెనీలకు అమ్మేయాలని కేంద్రం చూస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఉక్కు పరిశ్రమను రక్షించుకోవడం కోసం సిపిఎం కార్మికులతో కలిసి పోరాడుతూనే ఉందన్నారు. పోరాటాన్ని మరింత ఉధృతం చేయడంలో భాగంగా సిపిఎం ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఉక్కు రక్షణ యాత్ర పేరుతో బైక్ ర్యాలీ చేపడుతున్నట్లు వివరించారు. ఈ నెల 20న విశాఖలో ప్రారంభమయ్యే బైక్ ర్యాలీ.. అదేరోజు సాయంత్రం 4.30 గంటలకు విజయనగరం చేరుకుంటుందన్నారు. వై జంక్షన్ వద్ద స్వాగతం పలుకుతామని, అనంతరం కోట జంక్షన్ వరకు బైక్ ర్యాలీ సాగుతుందని, అదే ప్రాంతంలో బహిరంగ జరుగుతుందని తెలిపారు. అనంతరం విజయనగరంలో రాత్రి బస చేస్తారని చెప్పారు. 21న నెల్లిమర్ల, చీపురుపల్లి, రాజాం మీదుగా శ్రీకాకుళం జిల్లాలోని ఎచ్చెర్ల చేరుకుంటుందని తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో 22, 23 తేదీల్లో యాత్ర జరుగుతుందన్నారు. 24న పార్వతీపురం మన్యం జిల్లాలో కురుపాం మీదుగా పార్వతీపురం, సాలూరు, బొబ్బిలిలో యాత్ర సాగుతుందన్నారు. 25న గజపతినగరం, శృంగవరపుకోట మీదుగా సాయంత్రం అరకులోకి బైక్ ర్యాలీ వెళ్లనుందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉద్యోగులు, మహిళలు, ప్రజలను కోరారు. అనంతరం బైక్‌ర్యాలీ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు, టివి రమణ, పి.శంకరరావు, వి.లక్ష్మి పాల్గొన్నారు.

జెఎన్‌టియులో ముగిసిన హ్యాకేతన్ 2కె23 సదస్సు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెఎన్‌టియు-జివిలో సిఎస్‌సి విభాగం, ఇన్నోవేషన్ అండ్ ఇంక్యువేషన్ సెంటర్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించిన హ్యాకేతన్ 2కె23 శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఎపి ఇన్నోవేషన్ జెడి చిమట లావణ్య మాట్లాడుతూ ఇన్నోవేషన్ సొసైటీ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో జెఎన్‌టియు రిజిస్ట్రార్ జి.జయసుమ, ప్రిన్సిపల్ కె.శ్రీకుమార్, సిఎస్ఇ విభాగాధిపతి పి.అరుణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో చిత్తు కావద్దు

వన్ టౌన్ సిఐ బి.వెంకటరావు

ప్రజాశక్తి-విజయనగరం

విద్యార్థులు మత్తు పదార్థాలతో చిత్తు కావద్దని విద్యార్థులకు వన్ టౌన్ సిఐ బి.వెంకటరావు సూచించారు. శనివారం నగరంలోని బిపిఎం పాఠశాల విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలకు అలవాటు పడితే విచక్షణ కోల్పోయి, తామేమీ చేస్తున్నామన్న విషయం మరిచి, నేరాలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకుని చదువుపై దృష్టి పెట్టి, తల్లిదండ్రుల కలలను నిజం చేయాలన్నారు.

మాట్లాడుతున్న వన్‌టౌన్ సిఐ వెంకటరావు

కార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్ఐ ఎస్.భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామశాలను ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

వ్యాయామశాల ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని వి.టి.అగ్రహారం ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన వ్యాయామశాలను శనివారం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ప్రారంభించారు. వార్డు పర్యటనలో భాగంగా గతంలో విటి అగ్రహారంలో పర్యటించిన కోలగట్లకు స్థానిక యువకులు శిథిలావస్థలో ఉన్న వ్యాయామశాల గుర్చి వివరించారు. దీంతో సుమారు 23 లక్షల రూపాయలతో వ్యాయామశాల భవన నిర్మాణంతోపాటు వ్యాయామ సామగ్రిని కోలగట్ల సమకూర్చారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయా యాదవ్, వైసిపి జోనల్ ఇన్‌ఛార్జి బొద్దాన అప్పారావు, కార్పొరేటర్ చందక శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు, మారం బాల బ్రహ్మారెడ్డి, మాజీ కౌన్సిలర్ తాత్రాజు కృష్ణ, డివిజన్ అధ్యక్షులు అశోక్, నగరపాలక సంస్థ ఇఇ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ నగర్‌లో గడపగడపకు..

నగరంలోని 50వ డివిజన్ వైఎస్ఆర్‌నగర్‌లో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్ పాల్గొన్నారు. స్థానిక సమస్యలపై ఆరా తీశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పట్టా ఆదిలక్ష్మి, వైసిపి నాయకులు తోనంగి జగన్నాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

21న మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ వేలం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాజీవ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్మించిన 22 మున్సిపల్ షాపులకు ఈనెల 21న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు కమిషనర్ ఆర్.శ్రీరాములునాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 30న నిర్వహించిన మూడో విడత వేలంలో సత్వర స్పందన లేకపోవడం వల్ల వాయిదా వేసినట్లు చెప్పారు. ఆసక్తిగల వారు వేలంపాటలో పాల్గొనవచ్చునని కోరారు.

ఎగ'సాయ' సమావేశం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం కాస్త ఎగసాయ సమావేశంగా మారిందా? అంటే కచ్చితంగా అదే జరుగుతోందంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాస్తవ పరిస్థితులపై చర్చ జరపకుండా, చర్చల్లోనూ సలహా మండలి సభ్యులు, చైర్మన్‌కు అవకాశం ఇవ్వకుండా ప్రజాప్రతినిధులే ఆధిపత్య ధోరణి చలాయిస్తుండటంతో ఇటీవల జరిగిన వ్యవసాయ, సాగునీటి సలహా మండలి సమావేశాలు మొక్కుబడిగానే ముగిశాయని రైతులు చర్చించుకుంటున్నారు. ఇందుకు కారణం లేకపోలేదు. ఈ సమావేశాల్లో రైతుల తరపున ప్రాతినిధ్యం వహించే ప్రతినిధులు గానీ, చివరికి సలహా మండలి చైర్మన్ గానీ పెద్దగా మాట్లాడలేదు. మాట్లాడలేదనేకన్నా మాట్లాడేందుకు అవకాశం ఇవ్వలేదంటే బాగుంటుందేమో!. సమావేశం నిర్వహించిన తీరు ఇందుకు అద్దం పడుతోంది. సమావేశం మొత్తం జిల్లా పరిషత్తు చైర్మన్ తన కంట్రోల్‌లోకి తీసుకుని డిక్టేటింగ్ పద్ధతిలో నిర్వహిస్తే సామాన్యులు ఎలా తమ అభిప్రాయాలను చెప్పగలరని పలువురు ప్రశ్నిస్తున్నారు. అందువల్ల జిల్లాలో వ్యవసాయ స్థితిగతులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, వాటికి పరిష్కార మార్గాలపైనా, రైతులకు ఇవ్వాల్సిన సలహాలపైనా చర్చ జరగలేదని, అంతా రెండు గంటల్లో తూతూ మంత్రంగా ముగించారని రైతాంగం అసహనం వ్యక్తం చేస్తోంది.

వాస్తవంగా రైతులు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. జిల్లాలోకి ఈ ఏడాది రుతుపవనాలు ఆలస్యంగా రావడం, వర్షపాతంలో సమతుల్యత లేకపోవడం వంటి కారణాలతో ఖరీఫ్ పంటల సాగులో రైతులు వెనుకబడిపోయారు. ఉన్న కొద్దిపాటి సాగునీటి వనరులను కూడా ప్రభుత్వం సరిగా నిర్వహించలేకపోవడం, నిధుల కేటాయింపులకు మీనమీషాలు లెక్కించడం ఇందుకు కారణమని రైతులు చర్చిస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పంటలన్నీ కలుపుకుని 3,13,465 మేర సాగు కావాల్సి ఉంది. సీజన్ ముగింపు దశకు వచ్చినప్పటికీ 2,39,697 ఎకరాలకు మించి సాగవ్వలేదు. అదును తప్పిన వర్షాల కారణంగా జిల్లాలో మొక్కజొన్న 40 వేల ఎకరాలు సాధారణ విస్తీర్ణం కాగా, వర్షాభావ పరిస్థితుల వల్ల ఈ ఏడాది 24,055 ఎకరాల్లో మాత్రమే రైతులు నాటారు. చివరికి ప్రభుత్వం పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నామంటున్న మిల్లెట్స్ సాగు కూడా 38,350 ఎకరాలకు గాను 22,617 ఎకరాల్లో మాత్రమే సాగైంది. సమయానుకూలంగా వర్షాలు కురవకపోవడం, సాగునీటి ప్రాజెక్టుల ద్వారా నీరు అందకపోవడమే ఇందుకు కారణం. 64 వేల ఎకరాల స్థిరీకరణ ఆయకట్టుతో పాటు విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లో మరో 1,46,221 ఎకరాలకు ఆదనంగా నీరందించాల్సిన తోటపల్లి జలాశయం లక్ష్యానికి అనుగుణంగా సాగునీరు అందించలేకపోతోంది. ముఖ్యంగా ప్రాజెక్టు, కుడికాలువ పనులు పూర్తిచేసినట్టు ప్రభుత్వం చెబుతున్నప్పటికీ పిల్లకాలువలు, స్ట్రక్చర్లు అసంపూర్తిగా ఉండడంతోపాటు ఇటీవల కాలంలో ప్రధాన కాలువల నిర్వహణ కూడా అధ్వానంగా మారింది. దీనికితోడు గడిచిన ఆరు నెలల్లో మూడు సార్లు సీతానగరం, బొబ్బిలి మండలాల్లో కాలువకు గండ్లు పడడం ఇందుకు తార్కాణమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో, ప్రస్తుతం వరకు కేవలం 72 వేల ఎకరాలకు మించి నీరు అందడం లేదని అధికారిక గణాంకాలే స్పష్టం చేస్తున్నాయి. ముఖ్యంగా ప్రాజెక్టుకు చివర ఉన్న విజయనగరం జిల్లా నెల్లిమర్ల, చీపురుపల్లి, ఎచ్చెర్ల నియోజకవర్గాలకు చుక్కనీరు కూడా అందడం లేదు. చీపురుపల్లి నియోజకవర్గంలో 25,121 ఎకరాలకు తోటపల్లి కాలువ ద్వారా సాగునీరు అందాల్సి ఉండగా ఇప్పటి వరకు 17,252 ఎకరాలకు మాత్రమే సాగునీరు అందినట్టు సమాచారం. ఇటువంటి నేపథ్యంలో 90 శాతం రైతులు వర్షపునీటి ఆధారంగానే ఎక్కువ శాతం ఉబాలు పట్టారు. సాక్షాత్తూ జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ సొంత నియోజకవర్గం పరిధిలోని గడిగెడ్డ ద్వారా 2900 ఎకరాలకు సాగునీరు అందించాలి. ఈ ఏడాది గడిగెడ్డ జలాశయంలోకి చుక్కనీరు చేరలేదని ఆయా గ్రామాలకు చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల వల్ల గొలుసుకట్టు చెరువులు ఇటీవల కురిసిన భారీ వర్షాల వరకు నిండని పరిస్థితి దాపురించింది. ఉమ్మడి విజయనగరం జిల్లాలోని అన్ని జలాశయాల కిందా ఇటువంటి పరిస్థితులు ఉన్నాయి. సాగునీటి సలహా మండలి సమావేశంలో సాగునీరు అందుతుందా? అని జెడ్పీ చైర్మన్ అడగడం, 'ఎస్ సార్..' అంటూ అధికారులు తలూపడం తప్ప వాస్తవికత బయటపడలేదు. అధికారిక లెక్కల ప్రకారం నాలుగు రోజుల క్రితానికి నెల్లిమర్ల నియోజకవర్గంలో 13,227 ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉండగా, 1627 ఎకరాలకు సాగునీరు అందింది. వరుణుడు అదును తప్పించడం వల్ల కొంతమంది రైతులు పూర్తిగా మొక్కజొన్న వేయడం మానుకున్నారు. పూసపాటిరేగ మండలంలో 820 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా పట్టుమని పది మంది రైతులు కేవలం 25 ఎకరాల్లో మాత్రమే సాగుచేశారు. భోగాపురం మండలంలో 110 ఎకరాల్లో సాగుకావాల్సి ఉండగా ఒక్క ఎకరా కూడా సాగుకాలేదు. డెంకాడలో 415 ఎకరాలకుగాను 50 ఎకరాల్లో మాత్రమే సాగైంది. ఈ లెక్కలు మచ్చుకు మాత్రమే. దాదాపు అన్ని మండలాల్లోనూ అరకొరగాను, నామమాత్రంగానూ సాగయ్యాయి. చెరకు, పత్తి తదితర పంటల్లోనూ వెనుకబాటు ఉంది. మరోవైపు కౌలుదారులకు ఇప్పటి వరకు పంట రుణాలు ఇవ్వలేదు. సమావేశాల్లో ఇవేవీ పరిగణలోకి తీసుకోకపోవడం పట్ల సర్వత్రా అసంతృప్తి, అసహనం వ్యక్తమౌతోంది. సలహాలు, సాయాలకు బదులు ప్రభుత్వ సహకారం ఎగవేసే ధోరణిలో జిల్లా నేతలు వ్యవహరిస్తున్నారని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

ప్రజలు మరోసారి ఆశీర్వదించాలి

ప్రజాశక్తి - బొండపల్లి

ప్రజలు మరోసారి ఆశీర్వదించి జగన్మోహన రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని విజయనగరం ఎంపి బెల్లాన చంద్రశేఖర్, గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య కోరారు. వెదురువాడ గ్రామంలో శనివారం సచివాలయ భవనం, కొత్తపాలెంలో రైతు భరోసా కేంద్రం, వెల్నెస్ సెంటర్‌ను ఎంపి, ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం కొత్తపాలెం, బిలిపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. నాలుగేళ్లలో జగనన్న ప్రభుత్వం సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా చేయూతనిచ్చి ఆదుకొని సంతోషంగా వుండేటట్లు ప్రభుత్వం పని చేస్తున్నదన్నారు. నిరంతరం బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పరితపిస్తున్న వైయస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రి చేయాలని ప్రజలను కోరారు. ప్రజల ఆలోచన విధానంలో మార్పు రావాలని, మంచి, చెడులను బేరీజు వేయాలని ఆయన కోరారు. ప్రతిపక్ష టిడిపి నాయకుల కల్లబొల్లి మాటలను నమ్మ వద్దని వాస్తవాన్ని గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చల్ల చలం నాయుడు, జెడ్పిటిసి రాపాక సూర్యప్రకాశరావు, ఎఎంసి చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, మండల ప్రత్యేకాధికారి దుర్గాప్రసాద్, తహశీల్దార్ ప్రసాద్ రావు,

బొండపల్లి: శిలాఫలకం ప్రారంభిస్తున్న ఎంపి, ఎమ్మెల్యే

ఎంపిడిఒ వై.రాజేంద్ర ప్రసాద్, ఇఒపిఆర్‌డి సుగుణాకర్ రావు, వైస్ ఎంపిపిలు మీసాల సరోజిని, గొండెల ఈశ్వర రావు, వైసిపి మండల అధ్యక్షులు బొద్దల చిన్నంనాయుడు, గొట్లాం, రాచకిండాం పిఎసిఎస్ అధ్యక్షులు మహంతి రమణ, గొల్ల సతీష్, ఎపిఒ బి.కృష్ణవేణి, ఎపిఎం సులోచనా దేవి, ఎఒ మల్లికార్జున రావు, సిఎస్‌డిటి రవిశేఖర్, కొత్తపాలెం, మరువాడ కొత్తవలస, వెంద్రాం, ముద్దూరు సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చేతులమీదుగా ఆర్థిక సహాయం

మండలంలోని బిల్లలవలస గ్రామానికి చెందిన పత్తిగుళ్ల ఆది అప్పలనాయుడుకు శనివారం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి రూ.60వేలు నగదును ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అందజేశారు. ఆది అప్పలనాయుడు గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న విషయాన్ని తెలుసుకుని ఈ సాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ వేమలి ముత్యాలునాయుడు, నారాయణమూర్తిరాజు, సుంకరి శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

గరివిడి: చీపురుపల్లి పంచాయతీలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఎంపి బెల్లాన చంద్రశేఖర్ శనివారం ప్రారంభించారు. పట్టణం, పిల్లపేటలో నూతన వాటర్‌లో రూ.5 లక్షలతో నిర్మించిన వాటర్ ట్యాంకు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ నిధులతో వాటర్ ట్యాంకుని ఏర్పాటు చేశామని, పిల్లపేటలో సులభ కాంప్లెక్స్ చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణానికి రూ. 4లక్షలు, ఎంపి నిధులు రూ.8లక్షలతో కూరకుల వీధిలో సులభ కాంప్లెక్స్ చుట్టూ ప్రహరీ గోడ, లోపల ఫ్లోరింగ్, కాలువను ఎంపిపి నిధులతో నిర్మించామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, సర్పంచ్ మంగళగిరి సుధారాణి, శ్రీను, పతివాడ రాజారావు, బెల్లాన వంశీకృష్ణ, ఇప్పిలి సూర్యప్రకాష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సతివాడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం

గజపతినగరం: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపిపి బెల్లాన జ్ఞానదీపిక, జెడ్‌పిటిసి గార తవుడు అధ్యక్షతన శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం చప్పగా సాగింది. సమావేశంలో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, ఎంపి బెల్లాన చంద్రశేఖర్ పాల్గొన్నారు. విద్యుత్ శాఖలో విపరీతమైన సమస్యలు ఉన్నాయని, వాటిపై పలుమార్లు గజపతినగరం ఎ.ఇ కృష్ణ మూర్తికి తెలియచేసినా ఫలితం శూన్యమని, వాటిపై చొరవ తీసుకొని పరిష్కారం చూపించాలని సభ్యులు ఎమ్మెల్యేను కోరడంతో తరువాత జరిగిన సమావేశంలో ఎ.ఇ కూడా హాజరయ్యారు. వాటిపై తగిన చర్యలు చేపట్టే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో పిఎసిఎస్ అధ్యక్షులు కరణం ఆదినారాయణ, ఎంపిడిఒ కిషోర్ కుమార్, తహశీల్దార్ ఎం అరుణ కుమారి పాల్గొన్నారు.

6ఎ కేసు నమోదు

శృంగవరపుకోట: మండలంలోని పలు కిరాణా షాపులపై తనిఖీలు నిర్వహించి 277 కేజీల బియ్యం స్వాధీనం చేసుకున్నామని సిఎస్‌డిటి మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం మండలంలోని సంత గౌరమ్మపేటలో శ్రీరామ్ మూర్తి కిరాణా షాపు తనిఖీ చేసి 177 కేజీ పిడిఎస్ బియ్యాన్ని, కల్లూరి హరి కిరాణా షాపు తనిఖీ చేసి 96 కేజీల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ఇరువురు పై 6ఎ కేసు నమోదు చేశామన్నారు.

పక్కాగా ఆరోగ్య సురక్ష అమలు

రామభద్రపురం: జగనన్న ఆరోగ్య సురక్ష పక్కాగా అమలు చేయాలని ఎంపిడిఒ రమామణి ఆదేశించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల కేంద్రంలో ఉన్న సచివాలయం 2, 3 వైద్య సిబ్బంది, వాలంటీర్లతో సమావేశాన్ని నిర్వహించారు. జగనన్న ఆరోగ్య సురక్ష మార్గదర్శకాలు అమలకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. వీటిపై అవగాహన కల్పించి శిక్షణ ఇస్తున్నామన్నారు. శిక్షణను వినియోగించి కొని ఈ ప్రోగ్రామ్ ప్రజల్లోకి తీసుకు వెళ్లి విజయవంతం చేయాలన్నారు. సంపూర్ణ ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా ఈ పథకాన్ని ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని గ్రామీణ ప్రాంత పేదలకు కార్పొరేట్ వైద్యం అందజేయడమే లక్ష్యంగా సంబంధిత అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రాజారావు, స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి శిరీష, ఎంఇఒ తిరుమలప్రసాద్, హెల్త్ సూపర్‌వైజర్ వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

యూరియా వాడుకతో దిగుబడి తగ్గుదల

నెల్లిమర్ల: అధిక ఎరువుల వినియోగంతో దిగుబడి తగ్గుతుందని ఎఒ ఎం.పూర్ణిమ అన్నారు. శనివారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ రైతులు సమతుల ఎరువుల యాజమాన్యం పాటించాలన్నారు. ఎరువుల అధిక వాడకతో భూమి నిశ్శారమౌతుందని, చీడ పీడల ఉధృతి అధికమై దిగుబడి తగ్గే ప్రమాదం ఉందన్నారు. రైతులు ఇలాంటి సమయంలో యూరియాకి బదులుగా నానో యూరియా 500 మిల్లీ లీటర్ ఒక ఎకరాకు వేయడం ద్వారా మంచి ఫలితం ఉంటుందన్నారు. ఇది ఒక బస్తా యూరియా ఎరువుతో సమానమని పేర్కొన్నారు. వరి పంటలో ఎకరాకు 1 బస్తా డిఎపి ఆఖరి దమ్ములో 1.5 బస్తా యూరియా 3 దఫాలుగా దమ్ము, పిలకలు, పొట్టదశలో, అరబస్తా పోటాష్ పొట్టదశలో వేసుకోవాలని సూచించారు. అధికంగా యూరియా ఎరువు వేయుట వల్ల దోమపోటు, ఆకుముడత పురుగు, జింక్ లోపం వస్తాయి కాబట్టి రైతులు రసాయనిక ఎరువుల వాడక తగ్గించాలని కోరారు.

రిలే నిరాహార దీక్షల్లో పాల్గొనండి

వేపాడ: ఎస్‌కోటలో ఆదివారం ఉదయం చేపట్టనున్న రిలే నిరాహార దీక్షలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు శనివారం ఒక ప్రకటనలో కోరారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షకు మండలానికి చెందిన ప్రతి ఒక్క టిడిపి కార్యకర్త హాజరవ్వాలన్నారు. చంద్రబాబుని అక్రమంగా తప్పుడు కేసులు బనాయించి ఇబ్బంది పెడుతున్న వైసిపికి ఉద్యమాల ద్వారా బుద్ధి చెప్పాలన్నారు.

మండల స్థాయి అధికారులతో సమీక్ష

మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి లక్ష్మణరావు

తెర్లాం: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ప్రత్యేకాధికారి లక్ష్మణరావు శనివారం మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జగనన్న ఆరోగ్య సురక్ష, సచివాలయ భవనాల నిర్మాణాలు తదితర అంశాలపై చర్చించారు. అనంతరం కూనాయవలస గ్రామంలో జరుగుతున్న వెల్నెస్, రైతుభరోసా కేంద్రాలను, ఆరోగ్య సురక్ష సర్వేను నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే ప్రతీ వ్యక్తి యొక్క ఆరోగ్య స్థితి గతులను తెలిపే రిజిస్టర్ తప్పక వాడాలన్నారు. టెస్టులను క్షుణ్ణంగా చేయాలని ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం ఇతర ఆరోగ్య సిబ్బందికి సూచించారు. ఆయనతో పాటు ఎంపిడిఒ ఎస్ రామకృష్ణ, పాల్గొన్నారు.

భోగాపురం: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో శనివారం ఎంపిపి సహాధారం ఉప్పాడ సూర్యనారాయణ, ఎంపిడిఒ ఎన్ అప్పలనాయుడు ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా గుడివాడ సచివాలయంలో ఎంట్రాయిడర్ టైలరింగ్ మిషన్‌ను ప్రారంభించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పరిశీలించారు. గ్రామ సచివాలయ భవనాలు, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రతిపాదించిన పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

గరివిడి : చైతన్య భారతి సంస్థ ఆధ్వర్యంలో చీపురుపల్లి పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ సన్యాసి నాయుడు, చైతన్య భారతి టీం కలిసి అడ్వకేసీ మీటింగ్ శనివారం నిర్వహించారు. పిఎం ఉపేంద్ర మాట్లాడుతూ చైతన్య భారతి చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. చీపురుపల్లిలో సెక్స్ వర్కర్స్ ఎదుర్కొనే సమస్యలు గురుంచి తెలియజేస్తూ వాటిని పరిష్కరించాలని ఎస్ఐను కోరారు.

వైఎస్ఆర్ చేయూతపై అవగాహన

వేపాడ: మండలంలోని సింగరాయ సచివాలయంలో వైయస్సార్ చేయూత పథకంపై సర్పంచ్ ఎన్ వెంకట్రావు అధ్యక్షతన అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘాల్లో ఉన్న ప్రతి ఒక్క మహిళా రూ.150 నుంచి 200 రూపాయల వరకు పొదుపు చేయాలన్నారు. జగనన్న శ్రీనిధి, ఎస్‌సిఎస్‌పి గురించి వివరించారు. ఈ అవగాహన సదస్సులో మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఇఒపిఆర్‌డి రాంబాబుకు సన్మానం

తెర్లాం : మండలంలో పంచాయతీ విస్తరణాధికారిగా పనిచేసి శ్రీకాకుళం జిల్లా సారవకోట మండల ఎంపిడిఒగా పదోన్నతిపై వెళ్లిన రేగి రాంబాబును శనివారం ఘనంగా సత్కరించారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపిడిఒ ఎస్. రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భాగంగా ఆయన అందించిన సేవలు గురించి కొనియాడారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ ఎంఇఒ త్రినాధ రావు, మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

తారు రోడ్డు మంజూరు

శృంగవరపుకోట: పెదఖండేపల్లి నుంచి ఎస్‌కోట వరకు తారు రోడ్డు నిర్మాణానికి రూ. 2 కోట్లు మంజూరు కావడం పట్ల ఆ పరిసర గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుకు, ఉపముఖ్యమంత్రి పంచాయతీరాజ్ శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడుకి శనివారం ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జూలైలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పెదఖండేపల్లి గ్రామ ప్రజలు ప్రత్యేకంగా యువకులు తనను కలిసి ఈ రోడ్డు చిరకాల కోరికని తెలియజేసారన్నారు. దీంతో తాను మంత్రి బూడి ముత్యాలనాయుడుతో మాట్లాడి ఈ నిధులు మంజూరయ్యేలా చేశామని చెప్పారు.

మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్న గొంప కృష్ణ

విద్యార్థులకు పుస్తకాలు అందజేత

శృంగవరపుకోట: ఈ నెల 6న నిర్వహించిన గొంప కృష్ణ విద్యా సంకల్పం ప్రవేశ పరీక్షలో ప్రతిభ చూపిన అభ్యర్థులకు టిడిపి కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ శనివారం పుస్తకాలను పంపిణీ చేశారు. అక్టోబర్ నెలలో రాబోయే పోలీస్ పరీక్షను దృష్టిలో పెట్టుకుని 70 అభ్యర్థులకు 8 రకాల పుస్తకాల మెటీరియల్‌ను అందించారు.

టిడిపి, జనసేన పొత్తుతో వైసిపికి భయం

బొబ్బిలి: టిడిపి-జనసేన పొత్తుతో వైసిపిలో భయం నెలకొందని జనసేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి బాబు పాలూరి ఒక ప్రకటనలో అన్నారు. ఈ రెండు పార్టీల పొత్తుతో మంత్రులు భయపడి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. వైసిపి అవినీతి, అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపిని ఓడించి టిడిపి -జనసేన కూటమిని గెలిపిస్తారని చెప్పారు.

సంక్షేమ పథకాలతో ఆర్థికాభివృద్ధి

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

తమ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలతో పేద ప్రజల ఆర్థిక అభివృద్ధి చెందుతున్నారని ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు అన్నారు. శనివారం శివడవలసలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగేళ్ళ పాలనలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేద ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారన్నారు. ఇంటింటికి తిరిగి నాలుగేళ్లలో ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధి తెలియజేసిన బుక్ లెట్లు పంపిణీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ద్వారా ప్రజలు పొందిన లబ్ధిని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి శంబంగి లక్ష్మీ, నాయకులు వేణుగోపాలనాయుడు, జెడ్‌పిటిసి సంకిలి శాంతకుమారి, తహశీల్దార్ డి.రాజేశ్వరరావు, ఎంపిడిఒ రవి కుమార్, ఉప తహశీల్దార్ గౌరీశంకర్, జెసిఎస్ కన్వీనర్ తమ్మిరెడ్డి దామోదర్, ప్రభుత్వ అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస: ప్రతి కుటుంబం సంతోషంగా ఉండటమే వైసిపి ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని తుమ్మకాపల్లిలో శనివారం సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి గడపలోకి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు.



కొత్తవలస: బుక్లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

ఏమైనా సమస్యలుంటే తెలుసుకొని అక్కడికి అక్కడే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి నీలం శెట్టి గోపమ్మ, జెడ్‌పిటిసి నెక్కల శ్రీదేవి, పిఎసిఎస్ చైర్మన్ గొరపల్లి శివ, జామి వైఎస్ఆర్‌సిపి కన్వీనర్ గొర్లె రవికుమార్, ఎల్ కోట ఎంపిపి గేదెల శ్రీనివాసరావు, ఎల్.కోట జెసిఎస్ ఇంచార్జ్ యెడ్ల కిషోర్, స్థానిక సర్పంచ్ విరోతి కొండలరావు, ఎంపిటిసి పిల్లా లక్ష్మి, ఈశ్వర్ రావు, పిల్లా అచ్చులు, సంతపాలెం బిపి నాయుడు, సచివాలయం కన్వీనర్ సిహెచ్ ఆనందరావు, లెంక భాస్కరరావు, సీతారాంపురం ఎంపిటిసి గుమ్మడి సన్యాసప్పుడు, సోషల్ మీడియా నియోజకవర్గ కో కన్వీనర్ కర్రీ దేవుడు బాబు, మండల సోషల్ మీడియా కన్వీనర్ అడిగర్ల సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

సామాజిక బాధ్యత ఉండాలి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

పరిశ్రమలన్నింటికీ సామాజిక బాధ్యత ఉండాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. శనివారం మండలంలోని చింతపల్లిలో అరబిందో పరిశ్రమ రూ. 80లక్షలతో నిర్మించిన బహుళ ప్రయోజన కమ్యూనిటీ హాల్‌ను అరబిందో ఫార్మా ఫౌండేషన్ సంస్థ డైరెక్టర్ నిత్యానంద రెడ్డితో కలిసి ప్రారంభించారు. గ్రామంలో ఆర్‌ఒ ప్లాంట్, సోలార్ ప్లాంట్, ఎల్‌ఇడి వీధి దీపాలను మంజూరు చేయగా, ఆక్సిస్ క్లినికల్ లిమిటెడ్ రూ. 10లక్షలతో దీనిని అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంస్థ డైరెక్టర్ నిత్యానంద రెడ్డి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సుబులిటీలో భాగంగా మండలంలో ఉన్న అన్ని గ్రామాలలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. వీటి వల్ల మండలంలో ఉన్న గ్రామాలకు ఎంతో

కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ

ఉపయోగం ఉందన్నారు. అరబిందో ఫార్మా ఫౌండేషన్ చేస్తున్న ఈ అభివృద్ధి కార్యక్రమాలు అన్నింటినీ ప్రతి గ్రామంలో ప్రజలు వినియోగించు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బర్రి ముసలి, మత్స్యకార సంఘం జిల్లా అధ్యక్షులు బర్రి చిన్నప్పన్న, నాయకులు మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్ధన్ రావు, ఎంపిటిసి ఎం. తాత, అరబిందో ఫార్మా ప్రతినిధులు, శ్రేయాస్ ఫార్మా ప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆటల పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - వేపాడ

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మండల పరిధిలో గల అన్ని పాఠశాలలకు చెందిన బాల బాలికలకు అండర్14, 17లలో వివిధ రకాల క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో గెలిపొందిన క్రీడాకారులను నియోజకవర్గ స్థాయికి పంపించనున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ ఎస్ వల్లి, మండల విద్యాశాఖ అధికారి పి బాల భాస్కరరావు, వేపాడ, వల్లంపూడి గ్రామాల చెందిన సర్పంచులు పాల్గొన్నారు

శృంగవరపుకోట: మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ అండర్ -14,17 బాలురు, బాలికల సెలక్షన్స్, ఆటల పోటీలు ఎంఇఒ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బంగారు ఉమామహేశ్వరరావు సౌజన్యంతో నిర్వహిహించారు. పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ పొట్నూరు శ్రీరాములు మాట్లాడుతూ ఈ పోటీల్లో కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, ఖోఖో, త్రో బాల్, టెన్నికాయిట్, యోగ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో ఎంపికైన క్రీడాకారులను త్వరలో జరగబోవు నియోజకవర్గస్థాయి ఆటల పోటీలకు తీసుకెళ్తామన్నారు. ఈ పోటిల్లో మండలంలో గల 19 పాఠశాల నుంచి 700 మంది క్రీడాకారులు పాల్గొన్నారని శ్రీరాములు తెలిపారు. ఈ ఆటల పోటీలలో 19 స్కూల్స్ నుంచి 30 మంది వ్యాయామ ఉపాధ్యాయులు ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా వ్యవహ రించారు. క్రీడాకారులందరికీ ధర్మవరం ఉన్నత పాఠశాల భోజన సదుపాయం కల్పించింది. ఈ కార్యక్రమంలో ఎంపిపి సండి సోమేశ్వరరావు, జెడ్‌పిటిసి మమ్ములూరి వెంకటలక్ష్మి, ధర్మవరం సర్పంచ్ గాలి సన్యాసయ్య, ఎస్‌కోట సర్పంచ్ గనివాడ సంతోషి కుమారి, ధర్మవరం ఎంపిటిసి డోలా కనకమహాలక్ష్మి, పాఠశాల పేరెంట్స్ కమిటీ అధ్యక్షులు తగరంపూడి రమణ, ఉపాధ్యాయులు, పీడీలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా శనివారం నెల్లిమర్లలో మేము సైతం చంద్రబాబుకి తోడుగా సంతకాలు సేకరణ జరిపారు. ఈ దీక్షలో మాజీ మంత్రి పతివాడ నారాయణ స్వామినాయుడు టిడిపి నియోజకవర్గం ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు, నాయకులు మహంతి చిన్నం నాయుడు, కంది చంద్ర శేఖర్ రావు, సువ్వాడ రవిశేఖర్, సువ్వాడ వనజాక్షి, కడగల ఆనంద్ కుమార్, గేదెల రాజారావు, పోతల రాజప్పన్న, లెంక అప్పల నాయుడు, బైరెడ్డి లీలావతి, చీకటి సుహాసిని, నల్లం శ్రీనివాసరావు, చింతపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు. **గుర్ల:** మండల టిడిపి నాయకులు శనివారం అచ్యుతాపురం జంక్షన్‌లో ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద నివాళులు అర్పించారు. అనంతరం అచ్యుతాపురం జంక్షన్ నుండి చీపురుపల్లి వరకు బైక్ ర్యాలీగా వెళ్లి దీక్షలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వెన్నె సన్యాసినాయుడు, నాయకులు టి. కిరణ్ కుమార్, మహేశ్వరావు, కె విమలారాణి, నాగులపల్లి నారాయణ రావు, పిల్ల అప్పలనాయుడు, సంచాన సన్యాసి నాయుడు, దుర్గాసి కోటేశ్వరరావు, పాల్గొన్నారు.

గరివిడి : చంద్రబాబునాయుడుపై అక్రమంగా కేసులు పెట్టి జైలు పంపించారని టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి

బొబ్బిలి: కాగడాల ప్రదర్శన చేస్తున్న టిడిపి నాయకులు

కిమిడి నాగార్జున అన్నారు. చీపురుపల్లిలో శనివారం రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. దీక్ష శిబిరానికి జనసేన పార్టీ చీపురుపల్లి మండల అధ్యక్షుడు విసినిగిరి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, వెన్నె సన్యాసినాయుడు, చనమల మహేశ్వర రావు, తిరుమల రాజు కిరణ్ కుమార్ రాజు, పిళ్ళా అప్పలనాయుడు, సంచాన సన్యాసి నాయుడు, కనిమేరక కృష్ణ, దుర్గాసి కోటేశ్వరరావు, కిలారి సూర్యనారాయణ, కర్రోతు గోవింద, గొర్లె గోవింద, గుడాల రామకృష్ణ పాల్గొన్నారు. **శృంగవరపుకోట:** స్థానిక ఆకుల డిపో వద్ద టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ, పట్టణంలోని ధార గంగమ్మ ఫంక్షన్ హాలు వద్ద నియోజకవర్గ ఇన్చార్జి కోళ్ల లలిత కుమారి నియోజకవర్గ టిడిపి నాయకులతో వేరువేరుగా రిలే నిరాహార దీక్షలను కొనసాగించారు. ఈ దీక్షలలో నియోజకవర్గంలోని జనసేన పార్టీ నాయకులతోపాటు పలువురు నాయకులు పాల్గొని బాబుతో మేము సైతం అంటూ సంతకాలు చేసి సంఘీభావం తెలిపారు. దీక్ష శిబిరాలలో నియోజకవర్గం ఐదు మండలాల నుంచి టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు. **బొబ్బిలి:** చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా బొబ్బిలిలో టిడిపి చేపట్టిన నిరాహార దీక్షలకు సిపిఐ మద్దతు ప్రకటించింది. శ్రీఆంజనేయస్వామి ఆలయం వద్ద దీక్షను బేబినాయన ప్రారంభించారు. దీక్షా శిబిరాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ సందర్శించి మద్దతు తెలిపారు. **విజయనగరంకోట:** నగరంలో అశోక్ బంగ్లా వద్ద తెలుగు మహిళలు సామూహిక దీక్ష చేపట్టారు. ఈ దీక్షలకు ఎమ్మెల్సీ దువ్వరపు రామారావు సంఘీభావం తెలిపి, మాట్లాడారు. శనివారం సాయంత్రంలో నగరంలో తెలుగు మహిళలు కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, కార్యదర్శి బంగారు బాబు, మండల అధ్యక్షులు బొద్దుల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై ర్యాలీ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని సతివాడలో శనివారం ఏపి మోడల్ స్కూల్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రేవల్ల శ్రీనివాసురావు, ఎంపిటిసి రెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ మన చుట్టూ పక్కల పరిసరాలను శుభ్రంగా ఉంచుకొని ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటి మన పరిసరాలను, మన ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పద్మలత, వైస్ సర్పంచ్ చందక విశ్వనాథం, ఎంబరయ్య గుళ్ళు నాయకులు సీము నాగరాజు, మోడల్ స్కూల్ సిబ్బందిపాల్గొన్నారు.

వంగర: ప్రతి ఒక్కరూ చెట్లు నాటి వాతావరణాన్ని కాపాడాలని హెచ్‌ఎం ఖండాపు జగదీశ్వరి అన్నారు. ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని మండలంలోని అరసాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రయోగాత్మకంగా నిరూపించి విద్యార్థులకు ఓజోన్ పొర, కాలుష్య నియంత్రణ పై అవగాహన కల్పించారు. విద్యార్థులుచే మట్టి వినాయకుల విగ్రహాలను తయారు చేయించి విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు కొప్పర అప్పలరాజు, కే రమేష్ పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

రామభద్రపురం: జీవుల మనుగడకు కారణమైన ఓజోన్ పొర పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని బొబ్బిలి రోటరీ క్లబ్ అధ్యక్షులు జెసి రాజు తెలిపారు. శనివారం నాయుడువలస పాఠశాలలో అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఓజోన్ పొరను కాపాడుకుందాం అంటూ విద్యార్థులు అక్షరాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఉపాద్యాయులు శివున్నయుడు, కృష్ణం నాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

గరివిడి : ఓజోన్ పొర సంరక్షణ మానవ కర్తవ్యం కావాలని ఎన్‌సిఎస్‌సి జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ మిరియాల కృష్ణారావు అన్నారు. శనివారం చీపురపల్లి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో అంతర్జాతీయ ఓజోన్ డే నిర్వహించారు. డిప్యూటీ డిఇఒ కె. వాసుదేవరావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. విద్యార్థులకు వ్యాసరచన, డిబేట్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రెహానా బేగం తదితరులు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలతోనే పర్యావరణ పరిరక్షణ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మట్టి వినాయక విగ్రహాలతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమని నెల్లిమర్ల ఎస్ఐ పి. నారాయణరావు అన్నారు. శనివారం శ్రీరామతీర్థం సేవా సంఘం ఆధ్వర్యంలో స్థానిక రామతీర్థం జంక్షన్‌లో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో నెల్లిమర్లకు చెందిన సామాజిక సేవకుడు, బిల్డర్ ఆల్తి శ్రీనివాసరావు తన సొంత సొమ్ములో 2వేల మట్టి వినాయక ప్రతిమలను, 2వేల వినాయక వ్రతకల్పం పుస్తకాలను సమకూర్చారు. ఈ కార్యక్రమంలో సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రేగాన గోవిందరావు, సుదర్శనం విజయకుమార్, పాల్గొన్నారు. **బొబ్బిలి:** పట్టణంలో వనమిత్ర అధ్యక్షులు కె.కృష్ణదాసు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలుష్యాన్ని నియంత్రించేందుకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. కాలుష్యాన్ని నియంత్రించేందుకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేయాలని కోరారు. మట్టి వినాయక విగ్రహాలు వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. **వేపాడ:** మండలంలోని సోంపురం జిల్లా పరిషత్తు పాఠశాలలో మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలను శనివారం ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు. **శృంగవరపుకోట:** స్నేహ స్వచ్ఛంద సేవా సంస్థ వినాయక చవితి ని పురస్కరించుకుని, పర్యావరణ పరిరక్షణలో భాగంగా మంథా వారి కుటుంబ సభ్యుల సౌజన్యంతో 1000 మట్టి వినాయక ప్రతిమలను ఎస్‌కోటలో గల అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోను, సంస్థ సభ్యులకు, శ్రేయోభిలాషులకు శనివారం అందించింది. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు ఎయస్ వెంకట్రావు, కార్యదర్శి మంథా సుబ్బారావు, సభ్యులు రామనారాయణ, శ్రీరామ మూర్తి, సఫీ, గణేష్ పాల్గొన్నారు. **బొబ్బిలిరూరల్ :** ప్రతి ఒక్కరూ మట్టి గణపతిని పూజించి పర్యావరణాన్ని కాపాడాలని తహశీల్దార్ డి. రాజేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో మట్టి వినాయక విగ్రహాల్ని శనివారం పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో డి.టి గౌరీశంకరరావు, సిఎస్‌డిటి సాయికృష్ణ, పాల్గొన్నారు. పిఆర్ కార్యాలయం వద్ద జెవివి కన్వీనర్ సి.హెచ్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేశారు. **విజయనగరం:** పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక విగ్రహాలను ఉపయోగించాలని డిఆర్‌ఒ అనిత కోరారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ వద్ద మట్టి వినాయక విగ్రహాలను డిఆర్ఒ పంపిణీ చేశారు. **విజయనగరం టౌన్ :** మదర్ థెరీసా సేవా సంఘం, బ్లడ్ డోనర్స్ క్లబ్, మదర్ థెరీసా కిడ్స్ స్కూల్ సంయుక్తంగా మట్టి వినాయక విగ్రహాలను అయ్యన్నపేట జంక్షన్‌లోని ఆ పాఠశాలలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ ఫౌండర్ త్యాడ ప్రసాద్ పట్నాయక్, గౌరవ అధ్యక్షులు త్యాడ వేణుగోపాలం, సభ్యులు శ్రీనివాస్, పాల్గొన్నారు.

సమస్యలపై విద్యార్థుల నిరసన

ప్రజాశక్తి- గజపతినగరం

మండలంలోని మరుపల్లిలో ఎపి మోడల్ స్కూల్ విద్యార్థులు పాఠశాలలోని సమస్యలపై శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు కె.జగదీష్ మాట్లాడుతూ మరుగుదొడ్లు లేవని, రన్నింగ్ వాటర్ లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారని చెప్పారు. ఎన్నిసార్లు సంబంధిత ప్రిన్సిపల్‌కు చెప్పినా ఫలితం లేదన్నారు. అలాగే మధ్యాహ్న భోజనంలో పురుగులు ఉంటున్నాయని, దీనిపై కూడా ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. క్రీడా మైదానం కోసం విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేశారని ఆరోపించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు దృష్టికి సారించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతేకా పాఠశాలలో అనేక అక్రమాలు జరుగుతున్నాయని, వీటిపై విచారణ చేపట్టాలన్నారు. అనంతరం సమస్యల పట్ల స్థానిక సచివాలయ సెక్రటరీకి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రమేష్, సోమేష్, వెంకటరమణ, సంధ్య, శివ, విద్యార్థులు పాల్గొన్నారు.

బయటకు వచ్చి నిరసన తెలుపుతున్న విద్యార్థులు

పౌష్టికాహారంతో ఆరోగ్యం

ప్రజాశక్తి- బొబ్బిలి

పౌష్టికాహారంతో ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చునని ఐసిడిఎస్ సిడిపిఒ జె.విజయలక్ష్మి అన్నారు. పట్టణంలోని 5,6 వార్డులలో పోషన్ మహ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, పిల్లలు ఆరోగ్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వం పౌష్టికాహారాన్ని సరఫరా చేస్తుందన్నారు. పౌష్టికాహారం పంపిణీలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చిరు ధాన్యాలతో తయారు చేసిన ఆహార పదార్థాలను ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు జి.శ్రీనివాసరావు, వి.హైమావతి, సూపర్ వైజర్ బాలమణి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

రామభద్రపురం : పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉండగలమని ఐసిడిఎస్ సూపర్ వైజర్ డి.సూర్యకళ అన్నారు. మండల కేంద్రంలో 6, 8 అంగన్వాడీ కేంద్రాలలో పోషన్ మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు చెంచు లక్ష్మీ, చిన్నమ్మలు పాల్గొన్నారు.

బొబ్బిలి: మాట్లాడుతున్న పిఒ విజయలక్ష్మి

సారాపై ప్రచారం

ప్రజాశక్తి- బొబ్బిలి

రామభద్రపురం మండల పరిధిలో కరింధొరవలస గ్రామంలో నాటుసారా నివారణలో భాగంగా 'ఆపరేషన్ పరివర్తన' కార్యక్రమం నిర్వహించారు. బొబ్బిలి స్పెషల్ ఎన్ ఫోర్స్‌మెంట్ బ్యూరో సిఐ ఆర్ జైభీమ్ ఆధ్వర్యంలో నాటుసారా నివారణ గురించి ప్రచారం రథం ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ జైభీమ్ మాట్లాడుతూ నాటుసారా తయారు చేసినా అమ్మినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు నాటుసారా తాగటం వల్ల కలిగే కష్ట, నష్టాలను వివరించారు. నాటుసారాకి బానిస అవటం వల్ల కలిగే అనారోగ్య సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో సెబ్ ఎస్ఐ చిన్నం నాయుడు, సిబ్బంది చంద్ర ప్రసాద్, ఆదినారాయణ, జయరాం నాయుడు తదితరులు పాల్గొన్నారు.